ఆ మాటకి
దూరం
కాకుండా
చూసుకుంటునా

8 లో..

తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

ఇదండీ..కబురు..



సంపుటి : 22 సంచిక : 275 | గురువారం సెప్టెంబర్ 12 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8





# ఈ ఏడాదిలోగా మరో 35వేల ఉద్యోగాల భర్తీ

- పటిష్టంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు..అవినీతి భరతం పట్టాల్సిందే
- నేరస్థులకు పోలీసులంటే వణుకు పుట్టాలి
- మూసీ ఆక్రమణలు సమూలంగా తొలగిస్తాం
- పేదలకు మరోచోట డబుల్ ఇళ్లు ఇస్తాం
- చెరువుల ఆక్రమణదారులను జైలుకు పంపిస్తాం
- హైడ్రాపై విమర్శలను సహించేది లేదు
- ఎస్సైల పాసింగ్ అవుడ్ పరేడ్‌లో సిఎం రేవంత్ ఉద్ఘాటన



కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 11

ప్రభుత్వ ఉద్యోగాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో కీలక ప్రకటన చేశారు. ఈ ఏడాది పూర్తి అయ్యేలోపు మరో 35 వేల ఉద్యోగాలు ఇవ్వాలని ప్రజాపాలన ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ప్రకటించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన రెండు నెలల్లోనే 30వేల పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తుచేశారు. బుధవారం తెలంగాణ అకాడమిలో ఎస్సైల పాసింగ్ అవుడ్ పరేడ్‌కు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్ఐలకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.. ఈ సన్నివేశం మీతో పాటు నాకు కూడా మధుర జ్ఞాపకం అని అన్నారు. హైడ్రా పనితీరు భవిష్యత్ కార్యచరణపై ముఖ్యమంత్రి సంచలన కామెంట్స్ చేశారు. ఆక్రమణదారులను అవసరమైతే జైలుకు పంపించేందుకు కూడా వెనుకాడబోమన్నారు. ముందుగానే మేల్కొంటే మాత్రం మంచిదని సూచించారు. హైదరాబాద్‌లో జరిగిన పోలీస్ అకాడమిలో పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి హైడ్రాపై కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు వస్తున్నాయని తెలిపారు. వరదలతో పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయని అందుకే ప్రక్షాళన చేపట్టినట్టు తెలిపారు. చెరబట్టిన వారి నుంచి హైడ్రాతో చెరువులను విడిపిస్తున్నామన్నారు. అవసరమైతే ఆక్రమణదారులను జైలుకు పంపేందుకూ వెనకాడబోమన్నారు. ఆక్రమించుకున్న చెరువులను స్వచ్ఛందంగా వదులుకోవాలని ఆక్రమణదారులకు ఆఫర్ ఇచ్చారు. లేకపోతే చెరువులలోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి తీరుతామని హెచ్చరించారు. నాలాల ఆక్రమణలను నిరభ్యంతరంగా కూల్చేస్తామన్న రేవంత్... ఆక్రమణలు తొలగించి మూసీని ప్రక్షాళన చేస్తామన్నారు. మూసీ నాలాల్లో ఉన్న శాశ్వత నివాసదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. నివాసితులైన 11వేల మందిలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని భరోసా కల్పించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలను రెగ్యులరైజ్ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇకపోతే తెలంగాణ సాధించుకున్న తరువాత విద్యార్థుల్లో, ఉద్యమకారుల్లో , ప్రజల్లో ఎంతో అసంతృప్తిగా ఉందని.. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు తరువాత నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కొత్తగా నియమించి ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు. తెలంగాణలో అవలక్షణాలతో డ్రగ్స్ బానిసలయ్యారన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. పేజి 2లో

# మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్రం అనుమతులు




## వరద బాధితుల కోసం కోటి చెక్కు అందచేత

## సీఎం రేవంత్‌తో ఏపీ డిప్యూటీ సీఎం భేటీ

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 11

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. బుధవారం నాడు హైదరాబాద్ వచ్చిన ఆయన.. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిశారు. తెలంగాణ భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన వారికి అండగా నిలుస్తూ పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కోటి రూపాయల విరాళాన్ని సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. పవన్ కల్యాణ్, రేవంత్ రెడ్డి వెంట పలువురు కాంగ్రెస్, జనసేన నేతలు పాల్గొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలంగాణలో మున్నేరు వాగు.. ఏపీలో బుడమేరు పొంగి పొర్లాయి. మహోగ్రరూపం దాల్చిన మున్నేరు ఖమ్మంను ముంచెత్తగా.. బుడమేరు విజయవాడను ముంచేసింది. ఈ వరదలకు పదుల సంఖ్యలో ప్రాణ నష్టం సంభవించగా.. వేలాది మంది నిరాశ్రయుల య్యారు. వేల కోట్లలో ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో వదర బాధితులకు అండగా తన వంతు ఆర్థిక సాయం ప్రకటించారు ఆంధప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. తన సొంత నిధుల నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెరి కోటి రూపాయలు విరాళం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. టీవల ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఏపీకి ప్రకటించిన రూ. కోటి విరాళానికి సంబంధించి చెక్కును అందజేశారు. అదే సమయంలో ముంపునకు గురైన గ్రామాలకు.. రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు పవన్. ఇక తెలంగాణకు సైతం కోటి విరాళం ప్రకటించిన పవన్.. బుధవారం నాడు ఆ విరాళానికి సంబంధించిన చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు.



## జిల్లాకో మెడికల్ కాలేజీ సాకారం అయినట్లే
## వైద్య విద్య కోసం కెసిఆర్ ప్రత్యేక కృషి
## మాజీమంత్రి హరీష్ రావు వెల్లడి

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 11

మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడం సంతోషించదగ్గ విషయమని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ సహా గత నెలలో మెడికల్ కాలేజీల అనుమతి పొందిన ములుగు, నర్సంపేట, గద్వాల్, నారాయణపేట్ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తాజా అనుమతులతో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజి ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ కల సాకారమైందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మకమైన పురోగతి అని అన్నారు. అరవై ఏళ్లలో సాధ్యం కాని అద్భుతాలను దశాబ్ద కాలంలోనే ఆవిష్కరించిందని పేర్కొన్నారు. తెలంగాణ పిల్లలు వైద్య విద్య కోసమని లక్షలు ఖర్చు చేసి.. చైనా, ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పీన్ వంటి దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని హరీశ్‌రావు తెలిపారు. విద్యార్థులు మాతృ భూమికి, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ అవస్థలు పడాల్సిన అవసరం లేదన్నారు. ' ఒకవైపు ఎంబీబీఎస్ చదవాలనే ఆశ, మరోవైపు అర్థం కాని భాష, దేశం కాని దేశంలో గోస. ఇదంతా ఒకనాడు. కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలు, లోకల్ రిజర్వేషన్ వల్ల డాక్టర్ చదువాలనుకునే తెలంగాణ విద్యార్థులకు అవకాశాలు పెరిగాయి.' అని హరీశ్‌రావు అన్నారు. ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని.. దేశంలోనే రికార్డు నెలకొల్పిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి మొత్తం 8 మెడికల్ కాలేజీల ఏర్పాటు కోసం గత కేసీఆర్ ప్రభుత్వం నిధులు, భూ కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసిందని పేర్కొన్నారు.

మిగతా 2లో

## గాల్లో దీపంలా తెలంగాణ విద్యావ్యవస్థ
## ఎక్స్‌లో పోస్ట్ చేసిన మాజీమంత్రి కెటిఆర్



కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 11

కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ గాల్లో దీపంలా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సార్లు లేని బడులు, లెక్చరర్లు లేని కాలేజీలు, చివరకు చాక్‌పీసులు-డస్టర్లులేని స్కూళ్లు, అద్దె చెల్లించలేదని కాలేజీకి తాళాలు, రోడ్లపైకి విద్యార్థులు తెలంగాణలో కనిపిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలకు సంబంధించిన పలు వార్త కథనాలను షేర్ చేశారు. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా గ్రాంట్స్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అని కేటీఆర్ విమర్శించారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# ప్రజాభీష్టానికి పాతర



వేసవి ఒలింపిక్స్, పారాలింపిక్స్ – రెండూ పూర్తవడంతో ఫ్రాన్స్‌లో ఆటల వేడి ముగిసిందేమో కానీ, రాజకీయ క్రీడ మాత్రం బాగా వేడెక్కింది. కన్జర్వేటివ్ రిపబ్లికన్స్ పార్టీ నేత మిషెల్ బార్నియెర్‌ను దేశ ప్రధానిగా నియమిస్తున్నట్టు ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుయెల్ మెక్రాన్ గడచిన గురువారం చేసిన ప్రకటనతో రచ్చ రేగుతోంది. కొద్ది నెలల క్రితం జూన్ 9న పార్లమెంట్ దిగువ సభను రద్దు చేసి, ఆకస్మిక ఎన్నికలు ప్రకటించి, దేశాన్ని రాజకీయ ప్రతిష్టంభనకు గురి చేసిన మెక్రాన్ తీరా ఎన్నికల ఫలితాలొచ్చిన 60 రోజుల తర్వాత తాపీగా ప్రజాతీర్పుకు భిన్నంగా నాలుగో స్థానంలో నిలిచిన పార్టీ వ్యక్తిని ప్రధానమంత్రి పీఠంపై కూర్చోబెట్టారు. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన దేశంలో జరిగిన ఈ అపహాస్యమే ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. ఆగ్రహించిన వేలాది జనం వీధుల్లోకి వచ్చి, ప్రదర్శనలకు దిగింది అందుకే. కొత్త ప్రధాని సారథ్యంలో సరికొత్త ప్రభుత్వం కొలువు తీరుతుంది కానీ, రాజకీయ సంక్షోభం అంచున ఉన్న దేశానికి సారథ్యం వహించడం అగ్నిపరీక్షే. వెరసి ఫ్రాన్స్‌లో అనిశ్చితి తొలగకపోగా, మరింత పెరగనుండడమే వైచిత్రి. నిజానికి, ఫ్రాన్స్‌లో జూలైలో రెండో విడత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తీవ్ర మితవాద పక్షమైన 'నేషనల్ ర్యాలీ'నీ, అలాగే మెక్రాన్‌కు చెందిన 'రినైజెన్స్ బ్లాక్'నూ వెనక్కి నెట్టారు. వామపక్ష కూటమి 'న్యూ పాపులర్ ఫ్రంట్' (ఎన్ఎఫ్‌పీ)కి అధిక మద్దతు ప్రకటించారు. అయితే, ఎన్ఎఫ్‌పీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో హంగ్ పార్లమెంట్ ఏర్పడింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ లేని విధంగా ఇన్నాళ్ళుగా కొత్త ప్రభుత్వమేదీ లేకుండానే మెక్రాన్ కథ నడిపారు. పైగా, అధ్యక్షుడిగా తనకున్న విశేషాధికారాన్ని వాడి, వామపక్ష కూటమి ప్రతిపాదించిన అభ్యర్థి లెవరినీ ప్రధానిగా అంగీకరించలేదు. చివరకు ఎన్నికల్లోని ప్రజా తీర్పును అగౌరవిస్తూ, నాలుగో స్థానంలోని పార్టీ తాలూకు వ్యక్తిని ప్రధానిగా దేశాధ్యక్షుడు ఎంపిక చేయడం ఓటర్లకు, అందునా యువతరానికి అమితమైన ఆగ్రహం కలిగించింది. దాని పర్యవసానమే %-% వేలాదిగా జనం వీధు ల్లోకి రావడం! ఒక రకంగా ఈ ప్రధానమంత్రి ఎంపిక 'ఎన్నికల చోరీ' అని పేర్కొంటూ, ఏకంగా దేశాధ్యక్షుడు మెక్రాన్‌కే ఉద్వాసన పలకాలంటూ వాదించే స్థాయికి పరిస్థితి వెళ్ళింది. ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ లేని పరిస్థితుల్లో ఉన్నంతలో అధిక స్థానాలున్న కూటమికే పగ్గాలు అప్పగించడం విహితమని స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వ సిద్ధాంతాలను ప్రవచించిన ఘన ప్రజాస్వామ్యం నుంచి ఎవరైనా ఆశిస్తారు. కానీ, 2017 నుంచి విభజన రాజకీయాలు చేస్తున్న ప్రెసి డెంట్ మెక్రాన్ ఎన్నికలలో తన పార్టీ కింద పడ్డా తనదే పైచేయిగా వ్యవహరించారు. వరుసగా చేస్తూ వస్తున్న తప్పుల్ని కొనసాగిస్తూ ఇష్టారీతిన వ్యవహరించారు. ఆ మాటకొస్తే, రాజకీయాల పట్ల నమ్మకం క్షీణింపజేసే ఇలాంటి చర్యల వల్లనే ఫ్రాన్స్ సహా యూరప్ అంతటా తీవ్ర మితవాదం పైకి ఎగసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో ఆధిక్యం కనబరిచినవారికి కనీసం ఏకాభిప్రాయ సాధనకైనా అవకాశమివ్వకుండా అధ్యక్షుడు తన పదవీకాలపు లెక్కలతో తోచిన ఎంపికలు చేయడం అవివేకం. తీవ్ర మితవాదానికీ, దాని జాత్యహంకార, విదేశీయతా విముఖ సిద్ధాంతానికీ పట్టం కట్టరాదన్న ప్రజాభీష్టానికి వ్యతిరేకం. ఈ కొత్త సర్కార్ కింగ్ మేకర్లయిన తీవ్ర మితవాదుల మద్దతుపై ఆధార పడక తప్పని స్థితి. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో అధ్యక్షుడు దేశాన్ని మళ్ళీ చిక్కుల్లోకి నెట్టారు. అలాగని ప్రధానిగా ఎంపికైన 73 ఏళ్ళ బార్నియెర్ మరీ అనామకుడేమీ కాదు. బ్రెగ్జిట్‌పై యూరోపియన్ యూనియన్ పక్షాన గతంలో సంప్రతింపులకు సారథ్యం చేసిన వ్యక్తి. ఏకాభిప్రాయ సాధనలో ప్రసిద్ధుడు. రాజకీయ %-% సైద్ధాంతిక విభేదాలకు అతీతంగా అందరినీ కలుపుకొని పోగలి గినవాడు. ముగ్గురు దేశాధ్యక్షుల హయాంలో మంత్రిగా చేసిన ఆయనది యూరోపియన్ అనుకూల వైఖరి. అది వామపక్షాలకు నచ్చవచ్చు. ఇక, వలసల నియంత్రణకు మరింత కఠినమైన నిబంధనలు ఉండాలన్న వాదననే బార్నియెర్ సమర్థిస్తున్నారు. అది కన్జర్వేటివ్‌లకు నచ్చే అంశం. ప్రభుత్వ భవితవ్యంపై అనిశ్చితి నెలకొనడంతో... ప్రధానిగా ఇలాంటి వ్యక్తే సరైనవాడని మెక్రాన్ ఎంచు కున్నారట. కానీ, ఫ్రెంచ్ సమాజం నుంచి ఆమోదం లభించడం, రాజకీయంగా విజయం సాధించడం మెక్రాన్, బార్నియెర్‌లు ఇద్దరికీ అంత సులభమేమీ కాదు. సుదీర్ఘంగా శ్రమించక తప్పదు. యూకేతో బ్రెగ్జిట్ ఒప్పందం వేళ చేసినట్టే... ఇప్పుడూ ఏదో ఒక రాజీ మార్గంలో, అందరి మధ్య సహకారం సాగేలా కొత్త ప్రధాని చేయగలుగుతారా అన్నది ఆసక్తికరమైన అంశం. వచ్చే 7 నుంచి 12 ఏళ్ళ లోగా ఫ్రాన్స్ తన ప్రభుత్వ లోటును 10 వేల కోట్ల యూరోల పైగా తగ్గించనట్లయితే, ఇటలీ లాగానే ఫ్రాన్స్ సైతం అప్పుల సుడిగుండంలో చిక్కుకుపోతుందని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అక్టోబర్ 1లోగా కొత్త ప్రధాని, ఆర్థిక మంత్రితో కలసి 2025 బడ్జెట్ ముసాయిదాతో బిల్లుకు రూపకల్పన చేయాల్సి ఉంది. అది అతి కీలకమైన మొదటి అడుగు. అదే సమయంలో దేశాన్ని ఒక్క తాటి మీదకు తీసుకురావడానికే తాను పగ్గాలు చేపట్టినట్టు ఫ్రెంచ్ ప్రజానీకానికి ఆయన నచ్చజెప్పగలగాలి. ఏమైనా, ప్రజలు, పార్టీల మధ్య నెలకొన్న తీవ్ర స్థాయి విభేదాలతో ఫ్రెంచ్ రిపబ్లిక్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉంది. అది ఈ ఘన ప్రజాస్వామ్యా నికి పెను ముప్పు. ఆ ప్రమాదాన్ని తప్పించడంతో పాటు ఇంకా అనేక సమస్యలను కొత్త ప్రధాని నేతృత్వంలోని ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటికే పాలన పూర్తిగా అటకెక్కిన ఫ్రాన్స్‌ను ఆ దేశపు అతి పెద్ద వయసు ప్రధాని, అధ్యక్షుడు కలసి ఎలా ముందుకు నడిపిస్తారో వేచి చూడాలి.

# ఈ ఏడాదిలోగా మరో 35వేల ఉద్యోగాల భర్తీ

మొదటిపేజీ తరువాయి

పోలీస్ ఉంటే ఉద్యోగం కాదు.. ఇది ఎమోషన్ , బాగోద్వేగం.. డ్రగ్స్ , గంజాయి, సైబర్ క్రైమ్‌పై మీరు బలంగా పని చేస్తారని మీ పై పూర్తి విశ్వాసం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణాలో పెట్టుబడులు తీసుకురావడంతో పాటు ప్రజల కుల వృత్తులను ఆదుకుంటూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. దేశ చరిత్రలోనే 18 వేల కోట్లు రూపాయలు కడుపు కట్టుకొని రైతుల అకౌంట్లలో జమ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని, రుణమాఫీతో రైతన్నల కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. పేదల పట్ల ప్రభుత్వం మానవతా ధోరణితో వ్యవహరిస్తుందని, 11 వేల మంది బాధితులకు రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ పోలీస్ అకాడేమి నుండి ఈరోజు 547 సబ్ ఇన్స్‌పెక్టర్లు పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారిలో 145 మంది మహిళా ఎస్ఐలు, 402 మంది పురుషులు ఉన్నారు. 547 లో 401 మంది సివిల్ ఎస్ఐలు ఉన్నారు. అలాగే 547లో 472 మంది గ్రాడ్యూట్స్, 75 మంది పోస్ట్ గ్రాడ్యూఎట్స్ ఉన్నారు. వీరిలో 248 మంది ఎస్ఐలకు బీ టెక్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. పరేడ్ కమాండర్‌గా మహిళా ఎస్ఐ పల్లి బాగ్యశ్రీ వ్యవహరించారు. ట్రైనింగ్ పూర్తిచేసుకున్న వారిలో అత్యధికంగా 26 నుంచి ముప్పై వయసు గల అభ్యర్థులు ఉన్నారు. 283 మంది 26 నుంచి 30 సంవత్సరాల వయసు కలవారు శిక్షణ పొందారు. అలాగే 182 మంది 25 ఏళ్ళ లోపు వయసున్నవారు సబ్ ఇన్స్‌పెక్టర్లుగా శిక్షణ పొందారు. లా అండ అర్డర్ పరిరక్షణలో పోలీసులదే కీలక పాత్ర అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పోలీసులపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, పోలీస్ స్కూల్ ఏర్పాటుకు 50 ఎకరాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. డ్రగ్స్ గంజాయిపై పోలీసు సిబ్బంది ఉక్కుపాదం మోపుతున్నామన్నారని



ప్రశంసించారు. ప్రజల అవసరాలు తీర్చేవిధంగా కాంగ్రెస్ ప్రజాపాలన చేస్తోందని స్పష్టం చేశారు. గత సర్కార్ హయాంలో టిఎస్ పిఎస్ సిలో లీకేజీలు జరిగాయని, నిరుద్యోగల అసంతృప్తితోనే ప్రజాపాలన వచ్చిందని రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రేవంత్ వివరించారు. టిఎస్ సిపిఎస్ పై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవని, గతంలో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి వచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు వరసగా ఇస్తున్నామని వివరించారు. ఇదే వేదికపై నుంచి పోలీసులకు వరాలు ప్రకటించారు. పోలీసుల పిల్లల కోసం రెండు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించ బోతున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఒకటి వరంగల్‌లో రెండోది నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో 50 ఎకరాల్లో పోలీసుల పిల్లల కోసం రెసిడెన్షియల్ పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే రెండేళ్లలో హైదరాబాద్‌లో పోలీస్ స్కూల్ ప్రవేశాలు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీసు ఉద్యోగమనేది బాధ్యతమాత్రమే కాదని... భావోద్వేగమని అన్నారు. తెలంగాణను పునర్నిర్మించి, భవిష్యత్ తరాలకు బాటలు వేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు రేవంత్. ఏ సమస్య వచ్చినా ముందుగా అందుబాటులో ఉండేది పోలీసులేనని అందుకే వారు ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు. తెలంగాణను కాపాడుకునేందుకే ఖాకీ డ్రస్సులనే విశ్వాసం ప్రజలకు కల్పించాలని అన్నారు. అదే టైంలో తెలంగాణ యువతను వ్యసనాల బారిన పడేస్తున్న డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై ఉక్కు పాదం మోపాలని సూచించారు. అందరిని చూస్తోంటే తెలంగాణ డ్రగ్స్ రహితంగా మారుతుందన్న నమ్మకం కలుగుతోందన్నారు. డ్రగ్స్, గంజాయిపై ఉక్కు పాదం మోపుతామని... డ్రగ్స్ పేరు వింటేనే వెన్నులో వణుకు పుట్టాలని అన్నారు. కాస్మెటిక్ పోలీసింగ్ కాకుండా కాంక్రీట్ పోలీసింగ్ అవసరమని సిఎం రేవంత్ అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులకు మాత్రమే నేరస్తులకు కాదన్నారు. తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల పాత్ర చాలా ముఖ్యమన్నారు. యువత ప్రాణత్యాగంతో సాదించుకున్న తెలంగాణ తొమ్మిదేళ్లుగా అనేక సమస్యలు ఎదుర్కొందన్నారు. నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదని గుర్తు చేశారు. అన్నింటినీ చూసిన ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారని తెలిపారు. వారి దయతో ప్రజాప్రభుత్వ ఏర్పడిందని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేసినట్టు పేర్కొన్నారు. ఒక్కో వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ వచ్చామని ఇప్పుడు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కూడా ప్రక్షాళించామన్నారు. గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేసి నిరుద్యోగులకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేసారు. తెలంగాణలో నిరుద్యోగ యువకులు ఉత్సాహంతో పరీక్షలకు సిద్ధం అవుతున్నారని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం పెట్టుబడులు తీసుకురావడం, ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా రైతన్నలు, నేతన్నలు, గీతన్నలను ఆదుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో డిజిపితో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్రం అనుమతులు

మొదటిపేజీ తరువాయి

అయితే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 8 కాలేజీలకు గాను కేవలం నాలుగు మెడికల్ కాలేజీలకు మాత్రమే గత నెల ఎన్ఎంసీ నుంచి అనుమతులు లభించాయని చెప్పారు. నిబంధనల ప్రకారం మౌలిక వసతుల ఏర్పాటు, బోధనా సిబ్బంది నియామకంలో ప్రభుత్వం విఫలమైందని ఎన్ఎంసీ అనుమతులు నిరాకరించిందని హరీశ్‌రావు తెలిపారు. జరిగిన తప్పును ఆలస్యంగా గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్ఎంసీ నిబంధనల మేరకు అన్ని మౌలిక వసతులు, బోధన సిబ్బందిని సమకూర్చు కుంటామని అనుమతి కోరుతూ కేంద్రానికి అప్పీల్ చేసిందన్నారు. దీన్ని పరిశీలించిన కేంద్రం అప్పీల్ అంగీకరించి, 4 మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని ఎన్ఎంసీకి మార్గనిర్దేశర చేసిందని తెలిపారు. దీంతో ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, మొత్తం నాలుగు కాలేజీల్లో 200 సీట్లు ఈ అకడమిక్ ఇయర్ కు అందుబాటులోకి రానున్నాయన్నారు. కొత్త సీట్లతో కలుపుకొని తెలంగాణలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనే మొత్తం సీట్ల సంఖ్య 4,090 కు చేరుకుందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో కేవలం 850 ప్రభుత్వ మెడికల్ సీట్లు మాత్రమే ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 4,090 సీట్లకు చేరిందని హరీశ్‌రావు తెలిపారు. అంటే తొమ్మిదేళ్ల కాలంలో 5 రెట్లు పెంచిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి ఏటా పదివేల మందికి పైగా డాక్టర్లను తయారుచేసే రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందని చెప్పారు. ఓఃః౯ూ సీట్లలో లక్ష జనాభాకు 22 సీట్లతో దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమని అన్నారు. సమైక్య రాష్ట్రంలో వైద్యం, వైద్య విద్యలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గుర్తించిన కేసీఆర్ గారు జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తద్వారా పేద ప్రజల చెంతకే సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడంతో పాటు, తెలంగాణ బిడ్డలు వైద్య విద్య చదివే అవకాశాలను గణనీయంగా పెంచారన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తే, తెలంగాణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్కటి కూడా ఇవ్వలేదని తెలిపారు. అయినప్పటికీ రాష్ట్రం సొంత నిధులతోనే కొత్తగా మొత్తం 29 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని అన్నారు. అందుకు అనుగుణంగా వేగవంతమైన చర్యలు తీసుకున్నారని హరీష్ రావు చెప్పారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు 70 ఏండ్లలో రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటు జరిగితే, స్వరాష్ట్రంలో 9 ఏండ్లలో 29 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇది కేసీఆర్ ఘనత, బీఆర్ఎస్ ప్రభుత్వం ఘనత అని కొనియాడారు. వైట్ రెవల్యూషన్, గ్రీన్ రెవల్యూషన్, పింక్ రెవల్యూషన్, బ్లూ రెవల్యూషన్లకు తెలంగాణ నిలయంగా మారిందన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వైట్ కోట్ రెవల్యూషన్ కు నాంది పలికిందని తెలిపారు. ఇక్కడ ఎంబీబీఎస్ చదివిన వారు రాష్ట్ర ప్రజలకే కాదు.. వివిధ దేశాల్లో వారు సేవలందించబోతున్నారని హరీశ్‌రావు తెలిపారు. తద్వారా తెలంగాణ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేయబోతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ వైద్య విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా, వైద్య విద్య హబ్‌గా ఎదిగిందని చెప్పేందుకు గర్వ పడుతున్నానని పేర్కొన్నారు. పెరిగిన మెడికల్ సీట్లను రాష్ట్ర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ కావాలనే కలను సహకారం చేసుకోవాలని కోరారు. మెడికల్ కాలేజీల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలని, మౌలిక వసతులు, బోధన సిబ్బంది కొరత లేకుండా చూస్తూ ప్రతి ఏటా ఎన్ఎంసీ అనుమతులు (రెన్యువల్) కొనసాగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తద్వారా వైద్య విద్యార్థులకు నష్టం కలగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## గాల్లో దీపంలా తెలంగాణ విద్యావ్యవస్థ

మొదటిపేజీ తరువాయి

విద్యా శాఖకు మంత్రి లేదని.. శాఖను దగ్గర పెట్టుకున్న ముఖ్యమంత్రి దిక్కు లేదని అన్నారు. పదుల సంఖ్యలో ఢిల్లీకి చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి మీ సొంత నియోజకవర్గంలో అధ్యాపకులు లేక విద్యార్థులు టీసీలు తీస్కొని వెళ్లిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విద్యా శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష జరిపి సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. పిల్లల బంగారు భవిష్యత్తుతో చెలగాటం వద్దని హెచ్చరించారు.

## గాల్లో దీపంలా తెలంగాణ విద్యావ్యవస్థ

మొదటిపేజీ తరువాయి

విద్యా శాఖకు మంత్రి లేదని.. శాఖను దగ్గర పెట్టుకున్న ముఖ్యమంత్రి దిక్కు లేదని అన్నారు. పదుల సంఖ్యలో ఢిల్లీకి చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి మీ సొంత నియోజకవర్గంలో అధ్యాపకులు లేక విద్యార్థులు టీసీలు తీస్కొని వెళ్లిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విద్యా శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష జరిపి సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. పిల్లల బంగారు భవిష్యత్తుతో చెలగాటం వద్దని హెచ్చరించారు.

## ఉప ఎన్నికలు వస్తే బిఆర్ఎస్‌దే విజయం

### పది నెలల్లోనే కాంగ్రెస్‌పై అసంతృప్తి

### మాజీమంత్రి వేముల ప్రశాంత రెడ్డి విమర్శలు

తెలంగాణ అభివృద్దిని కాంక్షిస్తున్న ప్రజలు మరోమారు కెసిఆర్ సిఎం కావాలని కోరుకుంటున్నారని, ఉప ఎన్నికలు ఎప్పుడు జరిగినా బిఆర్ఎస్ విజయం తప్పదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేల అనర్హ ప్రకటిస్తే ఉప ఎన్నికలు ఖాయమని అన్నారు. అదే జరిగితే మళ్లీ బిఆర్ఎస్ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. పదినెలల కాంగ్రెస్ పాలనతో ప్రజల్లో అప్పుడే నిరాశా నిస్పృహలు ఏర్పడ్డాయని మాజీమంత్రి అన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కెసిఆర్ సంక్షేమ పథకాలు రూపొందించారన్నారు. అవేవీ అమలు కావడం లేదన్నారు. వ్యవసాయాన్ని ఒక పండుగలుగా మార్చారన్నారు. ఉచితంగా గొర్రెలను పంపిణీ చేసి.. గొల్ల కురుమల సంక్షేమానికి కృషి చేశారని ప్రశంసించారు. మాంసం ఉత్పత్తిలోనూ తెలంగాణ నంబర్ వన్ గా ఉండేదన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలతో పాలన చేరువైందని, ప్రజల చెంతకే అభివృద్ధి, సంక్షేమం అందిందని పేర్కొన్నారు. కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి అన్నిహంగులతో కలెక్టరేట్లతో పాటు ఆఫీసు సముదాయాలను నిర్మించామన్నారు. కొత్త జిల్లాలతోపాటు అవసరమైన చోట రెవెన్యూ డివిజన్లు, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసిన గొప్ప పాలనా దక్షకుడు కెసిఆర్ అని కొనియాడారు. వాటి ఫలాలు మన కండ్ల ముందు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రతి గ్రామం, పట్టణాలలో జరిగిన అభివృద్ధే ఇందుకు నిదర్శనమన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో ఇవేవీ కనిపించడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు తప్ప, నీటిని ఎత్తిపోసి వినియోగించుకునే ఆలోచనలు చేయడం లేదన్నారు. తెలంగాణకు ఎత్తిపోతలే శరణ్యమని అన్నారు.

# టీపీసీసీ అధ్యక్షుని సత్కరించిన మండలాల అధ్యక్షులు



**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 11**

బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని, మోస్రా మండలాల అధ్యక్షులు సురేష్ బాబా, కొత్తిమీరకర్ లక్ష్మణ్ బుధవారం కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాల అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పార్టీ శ్రేయస్సు కోసం కష్టపడ్డ నాయకునికి అధిష్టానం గుర్తిస్తుందని దానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అని అన్నారు.

## మోస్రా సిపిఎం పార్టీ కార్యదర్శిగా మేకల మల్లేష్



**కబురు న్యూస్ మోస్రా సెప్టెంబర్ 11**

మోస్ర మండల సిపిఎం పార్టీ కార్యదర్శిగా మేకల మల్లేష్ ను బుధవారం నిర్వహించిన మహాసభలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు కార్మికులు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడతానన్నారు. పార్టీ బలోపేతానికి ప్రజల సమస్యలపై పోరాడాలని పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు.

# విద్యుత్ పై పాఠశాల విద్యార్థులకు అవగాహన...




**కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్11..**

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యుత్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంప్యూటర్ ఉపాధ్యాయురాలు శాంతి విద్యుత్ సరఫరా గురించి బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు తో కలిసి విద్యార్థులు పట్టణంలోని బెల్లాల్ రోడ్డులో గల విద్యుత్ ఉత్పత్తి సబ్ స్టేషన్ కు వెళ్లి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా గురించి విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ప్రజలకు ఇబ్బంది పెడుతున్న పండ్ల బండిని తొలగించాలి...

**ఆటో డ్రైవర్స్ యూనియన్..**

**కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్ 11..**



బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న తోపుడు పండ్ల బండిని తొలగించాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు బుధవారం పట్టణ ఠాణా ఎదుట ధర్నా నిర్వహించి ఠాణా లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త బస్ స్టాండ్ లోని ఆటో స్టాండ్ వద్ద ఫ్రూట్ బండి అతను రోడ్డును ఆక్రమించుకుని ప్రజలకు, వాహన దారులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, పండ్ల బండితో ట్రాఫిక్ జామ్ కావడంతో బస్ స్టాండ్ దగ్గర ఉన్న ఆటో నడుపుకునే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అతనికి ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోక పోగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డును ఆక్రమించుకున్న పండ్ల బండిని తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

# విలేకరి వృత్తికి కళంకం తెస్తున్న బ్లాక్మెయిల్ విలేకరులు..

**- ప్రైవేటు విద్యాసంస్థలను ఆదాయ వనరులుగా మార్చుకుంటున్న విలేకరులు..**

**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 11**

సమాజంలో వృత్తి ఏదైనా వృత్తికి తగిన న్యాయం చేసినప్పుడే ప్రజల్లో వారు చేస్తున్న పనులను గుర్తించి వారికి విలువ గుర్తింపు ఇవ్వడం జరుగుతుంది.. ప్రస్తుతం పత్రిక విలేఖరిగా చేరెందుకు యాజమాన్యాలకు 5000 నుండి 10000 వరకు ముట్టజెప్పి ఐడి కార్డు తీసుకొని అక్రమ దందాలతో పాటు, ప్రైవేటు పాఠశాలలలో ఎగబడుతూ దోపిడికి పాల్పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటిని గుర్తించి వారి లోపాలను ఎత్తిచూపుతూ డబ్బులు దండుకోవడమే విలేకరి ప్రవృత్తిగా మార్చుకొని ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు డబ్బుల వేట కోసం విలేకరులు పరుగులు పెడుతున్నారు. సమాజంలో జరిగే అన్యాయాలను అక్రమాలను ప్రజలకు ప్రభుత్వాలకు తెలిసే విధంగా పనిచేయాల్సిన విలేకరులు కేవలం వారి స్వార్ధ ప్రయోజనాల కోసమే విలేకరులుగా అవతారం ఎత్తి డబ్బులు దండుకుంటూ తమ కుటుంబాలను




పోషించుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలలు కాలేజీలలో విలేకరులు చెప్పినంత డబ్బులు ఇవ్వకపోతే ఫోన్ చేసి వేధింపులు గురిచేయడంతోపాటు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసి వారితో ఒత్తిడి తెప్పించి మరీ డబ్బులు దండుకుంటున్నారని ప్రైవేటు పాఠశాల కళాశాల యాజమాన్యాలు లోపల మానసిక వేదనకు గురవుతున్నారు. ఇటీవల డివిజన్ లోని ప్రైవేటు విద్యాసంస్థకు లక్ష రూపాయలు డిమాండ్ చేసిన విలేకరులపై సంస్థ యాజమాన్యం పోలీసు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.బ్లాక్మెయిల్ చేస్తున్న విలేకరులను గుర్తించేందుకు జిల్లా ఉన్నతాధికారులు విలేకరుల కదలికలు వారి ఆదాయ మార్గాలపై దృష్టి సారించి పూర్తి నివేదికను జిల్లా ఉన్నత అధికారికి అందించనున్నట్లు సమాచారం. ఏది ఏమైనా సమాజంలో విలేకరి అనేది వేతనము, ఆదాయము సంపాదించే మార్గం కాకుండా సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే విలేకరులకు కొంతమంది చేస్తున్న వారికి తేడా ఉండడంతో నిజమైన రిపోర్టర్లకు గుర్తింపు లేకపోతుంది.

**రాత్రి వేళల్లో వాహనాలు ఆపి డబ్బులు దండుకుంటున్నా విలేకరులు......**

బాన్సువాడ డివిజన్లో రాత్రి వేళల్లో కొంతమంది విలేకరులు అర్ధరాత్రి సమయంలో కూడా వాహనాలను అక్రమంగా తరలించే వాహనాలను గుర్తించి డబ్బులు డిమాండ్ చేస్తూ వాహనాలను తనిఖీలు చేస్తు డబ్బులు అందిన కాడికి దండుకుంటున్నరని పలువురు బాహటంగానే చర్చిస్తున్నారు. ఇటీవల రాత్రివేళ వాహనాలు ఆపుతున్న విలేకరులను కొంతమంది చితకబాదినట్లు సమాచారం. రిపోర్టర్ల ఆగడాలకు అడ్డుకట్ట ఎవరు వేస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రిపోర్టర్ల పేరుతో తమ వాహనాలకు ప్రెస్ అని రాయించుకొని ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్న విలేకరులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రాష్ట్ర ఉన్నత అధికారులకు సైతం బాధితులు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

# కార్పొరేషన్ చైర్మన్ కాసుల ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షుని కలిసిన నాయకులు





**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 11**

టిపిసిసి అధ్యక్షుడిగా నియమకమైన మహేష్ కుమార్ గౌడ్ ను బుధవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ లో కార్యకర్త నుండి అంచలంచలుగా ఎదిగి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీగా, తన బాధ్యతను నిర్వహిస్తూ పార్టీలో తనకంటూ ఒక



ప్రత్యేకత చాటుకొని రాష్ట్రానికి పార్టీ అధ్యక్షుడిగా నియామకం కావడం ఎంతో అభినందనీయమన్నారు.. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పార్టీని ముందుండి నడిపించి మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, డిసిసి డెలిగేట్ కొత్త కాపు కాంత్ రెడ్డి, నేమాని వీర్రాజు, బీర్కుర్,వర్ని, మోస్ర మండలాల అధ్యక్షులు బొయిని శంకర్,సురేష్ బాబా, కొత్తిమీరకర్ లక్ష్మణ్, నాయకులు రహీస్, మన్నన్, గొల్ల వెంకన్న యాదవ్, దాసరి శ్రీనివాస్, దొంతురం కాశిరాం, సత్యం, పీరయ్య,

# ఆర్బీఐ ఆధ్వర్యంలో నిర్వహించే క్విజ్ పోటీలో పాల్గొనండి

## లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చౌహాన్..

**కబురు న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 11**

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా స్థాపించబడి 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఆన్ లైన్ క్విజ్ పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ అశోక్ చౌహాన్ తెలిపారు.ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 17 వ తేదీ లోగా ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.ఇద్దరు విద్యార్థులు ఒక టీం గా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు.పూర్తి వివరాలు అన్ని కళాశాలల నిర్వాహకులకు పంపించడం జరిగిందన్నారు.నాలుగు దశలలో ఈ క్విజ్



పోటీలు ఉంటాయని తెలిపారు.మొదటి దశలో ఇంటి వద్ద నుండే విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు.అనంతరం జరిగే రెండు,మూడు,నాలుగు దశల క్విజ్ పోటీలకు మాత్రం వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.ఈ పోటీలలో గెలుపొందిన వారికి భారీగా నగదు బహుమతి,పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ను ఆర్.బీ.ఐ, హైదరాబాద్ వారిచే అందించడం జరుగుతుందని ఎల్.డీ.ఎం వివరించారు.డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.

# బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి





## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు..

కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్, సెప్టెంబర్ 11 :

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఎస్ఆర్ - 2025 లో భాగంగా బీ.ఎల్.ఓ లు ఇంటింటికి వెళ్లి బీఎల్ఓ యాప్ ద్వారా కుటుంబ సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకోవడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఇంటింటి సర్వేకు తోడ్పాటును అందిస్తూ ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అవసరం ఉన్న చోట పోలింగ్ కేంద్రాలను విభజించడం, కొత్త వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాంటి పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తే, వాటి వివరాలను తమ దృష్టికి తేవాలని సూచించారు. అక్టోబర్ 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ ప్రకటించడం జరుగుతుందని, దానిని పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల పేర్లను జాగ్రత్తగా పరిశీలించాలని అన్నారు. ఈ ప్రక్రియ కోసం రాజకీయ పార్టీలన్నీ పోలింగ్ బూత్ ల వారీగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అక్టోబర్ 29 నుండి నవంబర్ 18 వ తేదీ లోపు రెండు పర్యాయాలు పోలింగ్ బూత్ స్థాయిలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రాఫ్ట్ రోల్ లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి సవరించడం జరుగుతుందన్నారు.కాగా,ఓటరు జాబితాలో ఎమ్మెల్యే,ఎంపీ,ఎమ్మెల్సీ,మాజీ జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే,మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్సీలు,ఇతర ప్రముఖుల పేర్లు ఉన్నాయా,లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు.2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా పేరు నమోదు చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు చూడాలని కోరారు.అర్హులైన వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్,సాత్విక్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వినాయకునికి చిన్నారుల ప్రత్యేక పూజలు...



కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్11..

బోధన్ పట్టణంలోని ఎల్.బి.ఎస్ నగర్ లో శ్రీ బాల గణేష్ మండలి వద్ద చిన్నారులు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం కాలనీలో చిన్నారులు ప్రతిష్టించిన వినాయక మండపంలో స్వామి వారికి పూజలు చేపట్టి పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్మితేష్, సాత్విక్, సుమిత్, సాకేత్, నేహన్ రాజ్, వర్ధన్, చరణ్, సారథి, సాయి రోహిత్, కరణ్, సంకేత్, అమిత్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన బావులను పరిశీలించిన సబ్ కలెక్టర్ వికాస్...





కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్11..

బోధన్ పట్టణంలోని వినాయకులను నిమజ్జనం చేసే బావులను సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. నవరాత్రులలో వినాయకునికి భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించి, పదకొండవ రోజు వినాయకుల శోభాయాత్ర చేపట్టే రూట్ మ్యాప్ ను ఏసీపీ శ్రీనివాస్ తో కలిసి సబ్ కలెక్టర్ వికాస్ మహతో బుధవారం పరిశీలించారు. గణేష్ నిమజ్జనం కోసం భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలో, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సంబంధిత అధికారులకు సబ్ కలెక్టర్ వివరించారు. పట్టణంలో వినాయకులను నిమజ్జనం చేసే ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బావి, పసుపు వాగులను పరిశీలించి, నిమజ్జన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. తహసీల్దార్ విఠల్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, ఠాణా,రూరల్ సీఐలు వెంకటనారాయణ, నరేష్ , మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, విద్యుత్తు, ఆర్ అండ్ బి అధికారులు ఉన్నారు.

# నిమజ్జన యాత్ర ప్రశాంతంగా జరిగేలా చూడాలి...జిల్లా కలెక్టర్

## - శోభయాత్ర మార్గాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 11

జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర వెళ్లే మార్గాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ పరిశీలించారు. స్టేషన్ రోడ్డు, గంజి రోడ్, పెద్ద బజార్, నిజాంసాగర్ చౌరస్తా మీదిగా కొత్త బస్టాండ్, ఇందిరాగాంధీ స్టేడియం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ తీగలు శోభయాత్ర కు ఆటంకం కలగకుండా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని విద్యుత్, మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అడ్లూరు ఎల్లారెడ్డి పెద్ద చెరువు వరకు శోభయాత్ర మార్గంను చూశారు. పెద్ద చెరువు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్, పోలీసు అధికారులకు సూచించారు. శోభాయాత్రలో గణేష్ మండపాల వారు జనరేటర్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెరువు వద్ద గజ ఈతగాళ్లను ఉంచాలని, భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించి ఎలాంటి ఇబ్బందులు కలకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ, ఎస్సైలు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువుల మరమ్మత్తులకు నివేదిక అందించాలి.. జిల్లా కలెక్టర్

కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 11



ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదల వలన దెబ్బతిన్న రోడ్లు, కాల్వలు, భవనాలు, చెరువులు, కుంటలు, త్రాగునీటి వసతుల తాత్కాలిక మరమ్మతులకు అవసరం అయిన నిధుల కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురిసిన వర్షాల వలన వివిధ రహదారులు, కాల్వలు, కల్వర్టులు, ప్రభుత్వ పాఠశాలలు తదితర దెబ్బతిన్న పనులకు తాత్కాలిక మరమ్మత్తులకు అవసరమైన నిధులు కొరకు ప్రతిపాదనలు స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ ఉత్తర్వులకు లోబడి ప్రతిపాదనలు సిద్ధంచేసి వెంటనే సమర్పించాలని తెలిపారు. మున్సిపల్, పంచాయతీ, రోడ్లు భవనాల శాఖలకు చెందిన రోడ్లు, కాల్వలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని వాటిని తాత్కాలికంగా మరమ్మతులకు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ లు సుజాత,శ్రీహరి డీఈఓ రాజు, ఆర్ అండ్ బి ఈఈ రవిశంకర్, పంచాయతీ రాజ్ ఈఈ బావన్న, నీటి పారుదల శాఖ ఈ ఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ నుండి అరుణాచలానికి ప్రత్యేక బస్సు సౌకర్యం...

కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్11..

బోధన్ నుండి తమిళనాడు రాష్ట్రంలో గల అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టిసి డిఎం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌర్ణమి సందర్భంగా పుణ్య క్షేత్రమైన అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు ఈ నెల 16న బోధన్ డిపో నుండి బయలుదేరి పుణ్యక్షేత్రమైన కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకునే వీలు కల్పిస్తుంది. 18 పౌర్ణమి న గిరి ప్రదక్షిణ కార్యక్రమం ముగించుకుని, అనంతరం తిరిగి బయలుదేరి జోగులాంబ అమ్మవారి దర్శనం చేసుకొని బోధన్ కు 19న రావడం జరుగుతుంది. పెద్ద వారికి 4,400 రూపాయలు, పిల్లలకు వారికి 3,600 చార్జీలు ఉంటాయని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిఎం కోరారు. సర్వీస్ నం. 96660తో రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.

కబురు KABURU TELUGU DAILY



## రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోగా బియ్యాన్ని సరఫరా చేయాలి.... జిల్లా కలెక్టర్



కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 11

జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు నిర్ణీత గడువు సెప్టెంబర్ 30 లోపు బియ్యం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన కార్యాలయంలో పౌరసరఫరాల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బియ్యం సరఫరా ఖరీఫ్ 2023-2024 సంబంధించి రైస్ మిల్లు యజమానులు పెట్టవలసిన దాన్యం సరఫరా వేగవంతం పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తమ పరిధిలోని రైస్ మిల్లులు తనిఖీ చేసి బియ్యం ఎఫ్ సి. ఐ./ పౌరసరఫరాల శాఖకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల సహాయ అధికారి నరసింహారావు, టాస్క్ ఫోర్స్ ఉప తాసిల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# టీపీసీసీ అధ్యక్షున్ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన మోస్రా నాయకులు





కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 11

బాన్సువాడ నియోజకవర్గంలోని మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తిమీర్ కార్ లక్ష్మణ్ బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కొత్తిమీరకర్ లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో పార్టీ నాయకులు కార్యకర్తల కృషి ఎనలేనిదని, నాయకులు, కార్యకర్తల కష్టాన్ని గుర్తించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన మహేష్ కుమార్ గౌడ్ కు టిపిసిసి అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తిమీరకర్ లక్ష్మణ్, కిసాన్ ఖేత మండల అధ్యక్షుడు తోట రాజు,సీనియర్ నాయకులు హరి నారాయణ, కర్ణి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## నవభారత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో మహా అన్నదానం.



కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 11

ాన్సువాడ మండలంలోని హాన్మాజిపేట్ గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నవభారత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆకుల నర్సింలు, కొత్తూరి శ్రీకాంత్, నాగమణిల జ్ఞాపకార్థం బుధవారం ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని పట్టణ సీఐ మున్నూరు కృష్ణ ప్రారంభించారు. అన్నదాత ఆకుల చంద్రశేఖర్ నీరజ దంపతులను గణేష్ మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణను గణేష్ మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల చంద్ర శేఖర్ గుప్తా, నవభారత్ గణేష్ మండలి సభ్యులు గైని శ్రీనివాస్, గంగరాజు సుధాకర్, భాస్కర్, రాజు, రామాగౌడ్,మంద సతీష్, కాశి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ ఛైర్మన్, సీఐ





కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 11

బాన్సువాడ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్ల పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, పట్టణ సీఐ కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు గణేష్ మండపాలను వారు సందర్శించారు. నిమజ్జన యాత్ర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కల్కి చెరువు వద్ద క్రేన్, జెసిబి, విద్యుత్ ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారి గంగాధర్, ఏఈ నాందేవ్, నార్ల ఉదయ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రైతులు ప్రణాళికతో పంటలు పండించి ఆర్థిక అభివృద్ధి సాధించాలి.. థామస్ మోడీ








కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 11

బాన్సువాడ పట్టణంలో నవ కిసాన్ బాన్సువాడ రైతు ఉత్పత్తిదారుల మహాజన సభను నాబార్డు, నాభ్కన్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు థామస్ మోడీ మాట్లాడుతూ రైతులు సంఘటితంగా ఐక్యమత్యంతో పంటలు పండించి ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాప్కాన్స్ ప్రతినిధులు యూసుఫ్, మండల వ్యవసాయ అధికారి,కమిటీ సభ్యులు గుడాల నాగేష్, సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డిఎస్పి సత్యనారాయణ

కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 11

బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువులో జరిగే గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పనులను బుధవారం డీఎస్పీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన యాత్రలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, నిమజ్జనం చేసేటప్పుడు గణేష్ మండలి నిర్వాహకుల సభ్యులు తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ కృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## కుటుంబ సభ్యులు సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు

**-గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి -**

మద్యం సేవించి వాహనం నడిపిన 39 మంది వాహనదారులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సభ్యులకు బుధవారం గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించిన గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వద్దనే ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని మీరు మీ కుటుంబ సభ్యులను భార్య పిల్లలను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలని సూచించారు.మరియు ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం రోడ్డు పైకి వస్తుందని, యజమాని లేని కుటుంబం చిన్నాభిన్నం అయిపోతుందని, మరియు ఎట్టి పరిస్థితుల్లో కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలని, లేకుండా వాహనం నడిపితే ఏదైనా ప్రమాదం జరిగితే ప్రమాద, మరియు రాంగ్ రూట్లో ప్రయాణిస్తున్నప్పుడు ప్రమాదం జరిగితే ఆ వ్యక్తికి గాని వాహనానికి గాని, మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులకు దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే వారికి కూడా ఇన్సూరెన్స్ వర్తించదని తెలిపినారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారు మరియు అతి వేగంతో వాహనాలు నడిపి జరిగిన ప్రమాదాల గురించి పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు.

# నామ కు దక్షిణ మధ్య రైల్వే అభినందనలు

▶ జెడ్ఆర్ యుసిసి సభ్యునిగా నామ విశేషమైన కృషి

▶ రైల్వే సమస్యల పరిష్కారం కొరకు నామ సేవలు అనిర్వచనీయం







**కబురు న్యూస్, ఖమ్మం సెప్టెంబర్ 11**

17వ లోక్ సభ సమయంలో జెడ్ఆర్ యుసిసి సభ్యునిగా, నాడు ఖమ్మం లోక్ సభ సభ్యునిగా నామ నాగేశ్వర రావు రైల్వే సమస్యలు పరిష్కారం కొరకు చేసిన విశేషమైన కృషిని కొనియాడుతూ దక్షిణ మధ్య రైల్వే, జనరల్ మేనేజర్ కార్యాలయం, సికింద్రాబాద్ నుండి సంబంధిత శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్, జెడ్ఆర్ యుసిసి ఎక్స్-అఫీషియో సెక్రటరీ నుండి రాసిన లేఖ బుధవారం ఖమ్మం, మాజీ ఎంపీ నామ కార్యాలయానికి అందింది. రైల్వే బోర్డు సూచనల ప్రకారం, ప్రస్తుత జెడ్ఆర్ యుసిసి పదవీ కాలం 30.09.2024 నుండి రద్దు చేయబడిందని తెలియజేయటంతో పాటు దక్షిణ మధ్య రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జెడ్ ఆర్ యు సి సి) సభ్యునిగా నామ ఇచ్చిన అమూల్యమైన సహకారం, మద్దతుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. నామ అనుభవాలు మరియు సూచనల వల్ల దక్షిణ మధ్య రైల్వే సేవలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. నామ అంకితభావానికి, సహకారానికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో మళ్లీ కలుసుకునే అవకాశం ఆశిస్తున్నాము అని నామ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. జెడ్ ఆర్ యు సి సి సభ్యునిగా నామ సేవలు అనిర్వచనీయం : రాష్ట్ర విభజన హామీలలో భాగంగా కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కొరకు పార్లమెంట్ లోన బయట మాట్లాడటంతో పాటు జెడ్ఆర్ యుసిసి సమావేశాల్లో కూడా నామ పట్టుబట్టారు. తాను వందకు పైగా లేఖలు రాయడం తో పాటుగా ఎంతో శ్రమించి సాధించిన భద్రాచలం - కొవ్వూ రు రైల్వే లైన్ కు సంబంధించి కొత్తగూడెం నుండి సత్తుపల్లి పూర్తి అయ్యింది, అలాగే సత్తుపల్లి నుండి కొవ్వూరు వరకు రైల్వే లైన్ కు నిధులు మంజూరు చేసి పూర్తి చేయలని, భద్రాద్రి కొత్తగూడెం పాండురంగాపురం నుండి సారపాక రైల్వే లైన్ తో పాటు రాష్ట్రం లో పలు పెండింగ్ రైల్వే లైన్ల సాధన కొరకు నామ పోరాడినారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం లో ప్రధానంగా రైల్వే స్టేషన్‌ల ఆధునీకరణ, అప్‌గ్రేడేషన్ కు అభివృద్ధిలో భాగంగా ఖమ్మం రైల్వే స్టేషన్లలో సీసీ టీవీలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, నూతన ప్లాట్‌ఫారమ్‌లు ఏర్పాటు, రక్షిత మంచి నీటి వాటర్ ప్లాంట్లు, మంచి వెయిటింగ్ హాల్స్, టాయిలెట్లు, ఫుడ్ వెండింగ్ స్టాల్స్, మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు రైల్వే స్టేషన్లలో కల్పించాలన్నారు. డోర్నకల్ - మిర్యాలగూడ రైల్వే లైన్ అలైన్మెంట్ పున:పరిశీలన చేయించి రైల్వే లైన్ మార్పు విషయంలో నామ పట్టుబట్టి ప్రజల అభిమతమే తన అభిమతమని, వారికి నష్టం కలిగే దేనిని సహించనని ఎట్టి పరిస్థితుల్లోనూ అలైన్మెంట్ మార్చాల్సిందేనని నామ నాడు పట్టుబట్టారు. అప్పటికే జాతీయ రహదారులు, నాగార్జున సాగర్, ఇతర వాటి వల్ల రైతులు తమ విలువైన భూములను కోల్పోయి, నష్టపోయారని, మళ్లీ ఉన్న కాస్త భూములను కోల్పోవడానికి సిద్ధంగా లేరని రైతుల పక్షాన నామ గళం వినిపించారు. దేశ వ్యాప్తంగా వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు సంబంధించి నిలుపుదల చేసిన రైల్వే పాసులను సత్వరమే పునరుద్ధరించి, తగిన చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సాక్షిగా కోరారు. నాడు రైల్వే సమస్యల పైన నాడు పార్లమెంట్ లో మాట్లాడడంతో పాటు, రైల్వే మంత్రులను, రైల్వే బోర్డు చైర్మన్ ను కలిసి, మాట్లాడి, లేఖలు అందించిన ఫలితంగా పెద్ద ఎత్తున ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం రైల్వే స్టేషన్ల అభివృద్ధి, కొత్త రైల్వే మార్గాలు, ఆర్వోబీ, ఆర్.యు.బి, అండర్ పాస్ ల నిర్మాణం జరిగింది. అందులో భాగంగానే ముత్యాలగూడెం, దెందుకూరు, మీనవోలు అండర్ పాస్ , కొత్తగూడెం రోడ్ ఓవర్ బ్రిడ్జి, డోర్నకల్ పాపటపల్లి రోడ్ అండర్ పాస్, మధిర- మోటమర్రి, మధిర-తొండలగోపవరం రోడ్ అండర్ పాస్ ల మంజూరు అయినవి. జిల్లాలో అమృత్ భారత్ పథకం ఒకొక్క రైల్వే స్టేషన్ కు రూ. 25.5 కోట్లు చొప్పున ఖమ్మం, మధిర, కొత్తగూడెం మూడు రైల్వే స్టేషన్స్ అభివృద్ధికి రూ. 76.5 కోట్లు మంజూరుకు కృషి చేశారు. ఎర్రుపాలెం , మోటమర్రి, బోనకల్, చింతకాని, కారేపల్లి, చీమలపాడు, గాంధీనగర్ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి, కనీస మౌలిక సదుపాయాలు కల్పనకు చొరవచూపారు. మధిర, ఖమ్మం నియోజకవర్గాల్లోని రైల్వే స్టేషన్ల నందు పలు రైళ్ల హాల్టింగ్ కోసం కృషి చేసినారు. బొగ్గు రవాణాకే పరితమైన సత్తుపల్లి రైల్వే స్టేషన్ ను ఆధునిక సౌకర్యాలతో బహుళార్ధ సాధకంగా తీర్చిదిద్దటంతో పాటు ప్రజల రవాణా అవసరాలు దృష్టిలో ఉంచుకొని సింగరేణి రైల్వే లైన్ కు సంబంధించి చంద్రుగొండ, సత్తుపల్లి కొత్త రైల్వే స్టేషన్ల అభివృద్ధి కి నిధులు మంజూరు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని పలు మార్లు ప్రస్తావించటం తో పాటు అనేక రైల్వే సమస్యల పైన నాడు జెడ్ఆర్ యుసిసి సమావేశాల్లో నామ తన గళం వినిపించారు.

# వరద బాధితుల సహాయాన్ని లక్షకు పెంచాలి





▶ ముంపు ప్రాంతంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ నిర్మించాలి

▶ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్

**కబురు న్యూస్, ఖమ్మం సెప్టెంబర్ 11**

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర ప్రతినిధి బృందం బుధవారం నాడు మున్నేరు వరద బాధిత ప్రాంతాలలో పర్యటించి బాధితులతో ఓదార్పు చేశారు ఈ ప్రతినిధి బృందం తొలిత మంచి కంటి నగర్ బొక్కలగడ్డ వెంకటేశ్వర్ నగర్ అనంతరం రాజీవ్ స్వగృహ ఏరియాలోని ముంపుగురైన ఇళ్లను దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి సర్వం కోల్పోయిన ముంపు బాధితులతో పలకరిస్తూ వారి బాధలను స్టడీ చేశారు ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రంగయ్య జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు ప్రగతిశీల ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి ప్రభాకర్ లు మాట్లాడుతూ వరద ప్రభావాన్ని ముందే అంచనా ఏసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వం తొలిత విఫలమైందని వరదలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని దీని కారణంగా ఎక్కువ ఆస్తి నష్టం వాటిల్లిందని వారు అన్నారు పేద మధ్యతరగతి ఇండ్లు నీరు పట్టడం కారణంగా రెండు నుంచి ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని వారు తెలియజేశారు లక్షలాది రూపాయలు నష్టపోతే కేవలం 16,500 ఇచ్చి చేతులు దులుపుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు . ఖమ్మం జిల్లాలో వరద కారణంగా 20 వేల ఇళ్లకు పైగా వరదలో చిక్కుకున్నాయని ఇంటికి లక్ష రూపాయల చొప్పున బాధితులకు అందజేయాలని అదేవిధంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున అందించే వారిని ఆదుకోవాలని వారు డిమాండ్. చేశారు ప్రతి సంవత్సరం వరదలతో కోట్లాది రూపాయల ప్రజల ఆస్తి నీళ్ల పాలు అవుతుంటే ముందస్తు ప్రణాళిక ప్రకారం వరద ముప్పు ఖమ్మానికి పట్టకుండా చర్యలు చేపట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు వరద ప్రాంతాల్లో ఉన్న పేదలను ఖాళీ చేయించి వారందరికీ 150 గజాలలో డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు వరద కారణంగా చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాన్ని 25 లక్షల కూడా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం ఖమ్మం వరద పై ఇంతవరకు ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదని తక్షణమే కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు .ఈ ప్రతినిధి బృందంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిన్న చంద్రన్న ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పుల్లయ్య ఆవుల అశోక్ ఝాన్సీ శోభ మంగతాయి సురేష్ కే శ్రీను భరత్ సత్తార్ ధరణి కృష్ణ వెంకటేష్ లక్ష్మణ్ రవీందర్ శారద జాస్మిన్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు...

# అన్నదానం మహాదానం...

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్



**కబురు న్యూస్, ఖమ్మం రూరల్ సెప్టెంబర్ 11**

అన్ని దానాల కంటే అన్నదానం మహాదానమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానాన్ని నిర్వహించారు. దీనిని సిపిఐ నాయకుడు, మా రాజు మిల్క్ పార్లర్ ప్రోప్రైటర్ బియ్యాల రాజు-పద్మావతి దంపతులు వితరణ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ... వినాయక మండపాలను ఏర్పాటు చేసుకుని, అన్నదానాలు చేయడం అభినందనీయం అన్నారు. నిరుపేదల బుక్కెడు పొట్ట నింపడంతో పాటు వారి కష్టసుఖాల్లో యువత పాలుపంచుకుంటూ అండగా నిలవాలన్నారు. మంచి వాతావరణంలో నవరాత్రులను ముగించుకుని, ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అక్కినపల్లి చిన్న దేవయ్య, వినోద్, కళ్యాణ్ కిట్టు తదితరులు పాల్గొన్నారు

# వరద బాధితలు ధైర్యం కోల్పోకుండా ఆత్మవిశ్వాసంతో ఉండండి

**కబురు న్యూస్, ఖమ్మం సెప్టెంబర్ 11**

( జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఖాలిద్ ముబశ్శిర్ ఉజ్ జఫర్ )

బుధవారం స్థానిక కార్యాలయంలో వరద బాధిత లకు బియ్యం, నిత్యావసర సరుకులతో పాటుగా వంట సామాన్లు, స్టీల్ సామాన్లు, చాపలు ,బ్లాంకెట్స్ తదితర వస్తువులు జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఖాలిద్ ముబశ్శిర్ ఉజ్ జఫర్, రాష్ట్ర సలహా మండలి సభ్యులు సాదిఖ్ అహ్మద్, రాష్ట్ర మాజి కార్యదర్శి మొహమ్మద్ ఇలియాస్, జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా, మోతి మస్జిద్ ఇమామ్ సాబ్ మౌలానా అబ్దుల్ ఘని వరద బాధిత లకు అందజేయటం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం నగర పరివాహకం లోని మున్నేరు నది వరద ముంచెత్తి నీటిలో పూర్తిగా మునిగిపోయి నిరాసులైన వివిధ వాసులకు గత వారం రోజులుగా జమాఅతె ఇస్లామి హింద్ ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో నిరంతరంగా వరద బాధితలకు సేవా కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. ఈ విపత్తు చాలా బాధాకరమని చాలా మంది నిరాశ్యులయ్యారని వారి సహాయార్థం నిత్యవసర సరుకులతో పాటుగా ఇతర వస్తువులకు సంబంధించిన కిట్టు అందిస్తున్నామని అన్నారు. భూ వాసి పై దయ చూపితే ఆకాశా వాసి మనపై దయ చూపుతాడు అన్నారు. వరద బాధితలు ధైర్యం కోల్పోకుండా ఆత్మవిశ్వాసంతో ఉండాలని అన్నారు.లాప్ టాప్ , ప్రింటర్ అందజేత

ఖమ్మం పట్టణంలోని సారది నగర్ ప్రాంతానికి చెందిన ఇష్రత్ పర్వీన్ ప్రిలిమ్స్ పాసై మెయిన్స్ ప్రిపేర్ అవుతున్న తరుణంలో గత పది రోజుల క్రితం వచ్చిన వరదలకు తమ యొక్క పుస్తకాలు లాప్ టాప్, ప్రింటర్ అన్ని నీటిపాలయ్యాయి. ఈ విషయం తెలిసిన జమాఅతె ఇస్లామి హింద్ ఖమ్మం శాఖ ఇష్రత్ పర్వీన్ కు లాప్ టాప్ ప్రింటర్ జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఖాలిద్ ముబశ్శిర్ ఉజ్ జఫర్ చేతుల మీదగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇష్రత్ పర్వీన్ మాట్లాడుతూ నా చదువు యొక్క సామాగ్రి సర్వం నీటిపాలై ధైర్యం కోల్పోయి దిగులుగా ఉన్న సమయంలో నా దగ్గరికి దేవుడు జమాఅతె ఇస్లామి హింద్ సభ్యులను పంపించి సరైన సమయంలో సహాయం అందించారు. నేను కూడా ప్రయోజకు రాలై పేదలకు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు ఈ కార్యాక్రమమలో జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ సమి, ఖిల్లా, ఇంద్రనగర్, ఇస్లాంపేట అధ్యక్షులు అబ్దుల్ మలిక్, అబ్రార్ అలీ, షేక్ రఫీ సభ్యుల అబ్దుస్ సుబూర్, అక్బర్ మూసా, యసుఫ్ షరీఫ్, నిజాముద్దీన్, గౌస్, ఫయాజ్, అబ్దుల్ రజాక్ , ఇలియాస్, ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం మహిళా శాఖ ఖిల్లా అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, ఇంద్రనగర్ అధ్యక్షురాలు హుస్సేన్ బీ, ఇస్లాంపేట అధ్యక్షురాలు ఖాసిమ షాహిన్ తదితరులు పాల్గొన్నారు

# గణపతి నవరాత్రి పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



-శాంతి యుతంగా కొనసాగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు -

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన గణపతి మండపం లో బుదవారం మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, యువ నాయకుడు ఎన్ సీ సంతోష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు,గణపతి నవరాత్రి పూజల్లో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ గణపతి అనుగ్రహంతో అందరూ బాగుండాలని ఆది దేవుడు గణపతిని పూజిస్తే అంతా మంచి జరుగుతుందని గణపతి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న అందరికి వినాయక అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం యువ నాయకుడు ఎన్ సీ సంతోష్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 5 వ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని, వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నెలకొల్పిన గణపతి దాదాపు మూడు దశాబ్దాల క్రితం చిన్న వినాయకుడి స్థానం నుండి భారీ గణపతి విగ్రహం ఏర్పాటు చేసి ప్రతి రోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు శేషం శ్రీనివాసచార్యులు, వెంకటేశ్వర దేవాలయం చైర్మన్ బుక్క రమేష్, పెద్ద ఎత్తున 18 వ వార్డ్ ప్రజలు, భక్తులు, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం కు భక్తుడు రూ.1,00,116 విరాళం



కబురు న్యూస్, (పాలకుర్తి ప్రతినిధి):
శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నిర్వ హించనున్న అన్నదాన పథకానికి భక్తుడు రూ.1,00,116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈవో మోహన్ బాబు ఒక ప్రకటన తెలిపారు.ఎన్ఆర్ఐ రావుల అరవింద్- శ్వేత దంపతులు ఆలయంలో త్వరలో నిర్వహించనున్న అన్నదాన పథకానికి విరాళం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ కే వెంకటయ్య. అర్చకులు డివిఆర్ శర్మ,సిబ్బంది పాల్గొన్నారు.

# బదిలీ అయి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

-ఎస్ టీ యూ జిల్లా అధ్యక్షులు పి ఆర్ శ్రీనివాస్



జమ్మికుంట (ప్రజా మంటలు )ఈ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో బదిలీ అయి రిలీవ్ కాకుండా యధా స్థానంలో కొనసాగుతున్న టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జమ్మికుంట మండలంలో రాష్ట్ర కార్యదర్శి సానకిషన్ తో కలిసి సభ్యత్వ నమోదును నిర్వహించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బదిలీ పొందిన టీచర్లను వెంటనే విడుదల చేయాలని ఆన్ లైన్ సాంకేతిక క తప్పిదాలతో బదిలీ అయిన వారి తప్పిదాలను సవరించి వారికి న్యాయం చేయాలని అవకాశం కల్పించాలని వారు పేర్కొన్నారు.
ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు సర్వీస్ పర్సన్ల నియమాలకు సంబంధించి నిధులు, నిబంధనలు విడుదల చేయాలని , అకాడమిక్ ఇయర్ ప్రారంభమై నాలుగు మాసాలు కావస్తున్న దరమిలా వెంటనే స్కూల్ గ్రాంట్ మంజూరు చేయాలని, నాణ్యమైన విద్య అందించేందుకు రెగ్యులర్ పర్యవేక్షణ అధికారులను నియామకం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అంతకుముందు జమ్మికుంట మండలంలో అన్ని పాఠశాలలో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి ఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారి, రాష్ట్ర కార్యదర్శి సానకిషన్ , జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, శెట్టి రాజమౌళి, నేరుపాటి ఆనంద్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రజాక్ పాషా, పురుషోత్తం మూర్తి, జిల్లా మండల నాయకులు మేడుదుల నాగరాజు, దేవుని రఘు, సంతోష్ మహేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



కబురు న్యూస్, (పాలకుర్తి ప్రతినిధి):
పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన గాయల చంద్రయ్య కుమారుడు జయంత్ ఆరోగ్య రీత్యా బాగా లేకపోవడం వలన నిమ్స్ ఆసుపత్రిలో వైద్య నిమిత్తం పాలకుర్తి శాసన సభ్యురాలు హనుమాండ్ల యశస్విని రెడ్డి వెంటనే స్పందించి వారికి ఆపరేషన్ ఖర్చుల కొరకై ఐదు లక్షల రూపాయలు అవసరమై నందున సీఎం సహాయ నిధి కింద ఎల్ఓసి మంజూరు చేయించడం జరిగింది .ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్ పాల్గొనడం జరిగింది

# ఎర్రబెల్లి ఇలాకాలో బీఆర్ఎస్ కు ఎదురుదెబ్బ!!

-మాజీ సర్పంచ్ రాజీనామా



కబురు న్యూస్, (పాలకుర్తి ప్రతినిధి):
పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన సీనియర్ బి.ఆర్.ఎస్ నాయకులు తాజా మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు బిఆర్ఎస్ పార్టీలో చురుగ్గా కొనసాగుతూ గత ఎన్నికలలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గెలుపులో కీలకపాత్ర పోషించారు. పాలకుర్తి టౌన్ తో పాటు మండలంలో తనకంటూ ప్రత్యేకమైన ఓటు బ్యాంక్ కలిగి ఉన్న వీరమనేని యాకాంత రావు రాజీనామాతో బిఆర్ఎస్ తీవ్రంగా నష్టపోనుంది. బుధవారం రోజు ఆయన బిఆర్ఎస్ పార్టీకి ,ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి తన రాజీనామా లేఖను పార్టీకి, మాజీ మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రబెల్లి దయాకర్ రావుకు పంపించారు

# సాయి మానసిక రంగుల ప్రత్యేక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం



(కబురు న్యూస్, ప్రతినిధి జమ్మికుంట)
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని సాయి మానసిక దివ్యాంగుల విద్యార్థుల ప్రత్యేక పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ ప్రెసిడెంట్ శ సూత్రపు బుచ్చిరాములు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ ప్రెసిడెంట్ మాట్లాడుతూ..... ఈ సమావేశంలో 35 మంది దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు రావాల్సి ఉండగా 20 మంది పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు .ఇట్టి సమావేశంలో దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రుల పాత్ర అతి ముఖ్యమైనదని ఆశ్రమానికి పిల్లల తల్లిదండ్రులు పట్టుకొమ్మలని. ఒక వృక్షానికి తల్లి వేరు ఎంత ప్రధానమో ఈ ఆశ్రమానికి తల్లిదండ్రుల కూడా అంతే ప్రధానం అన్నారు. అధికారులు గానీ, అనాధికారులు గాని, ఇంకా ఎవరైనా గాని ,పిల్ల వేర్లు మాత్రమే అని. ఈ ఆశ్రమ అభివృద్ధికి మీ అమూల్యమైన సలహాలు ,సూచనలు, సహకారం ఆశ్రమానికి ఎల్లవేళలా కొనసాగించాలని ఆశ్రమ నిర్వాహకులు కోరారు.ఆశ్రమ అభివృద్ధికి మా వంతు సహకారంగా తప్పనిసరిగా సహాయం చేస్తామని పిల్లల తల్లిదండ్రులు హామీ ఇచ్చారు.పాఠశాల సిబ్బంది కూడా విద్యార్థులకు ఇచ్చే ప్రత్యేకమైన శిక్షణ గురించి తల్లిదండ్రులకు వివరించామన్నారు.తల్లిదండ్రులు కూడా మేము ఇచ్చే శిక్షణ తప్పనిసరిగా ఇంటివద్ద కొనసాగించాలని ఈ ఆశ్రమ అభివృద్ధికి తోడ్పడాలని గుర్రం జరిగిందని చెప్పారు. ఇక్కడ పాఠశాల శిక్షకుల తో పాటు సిబ్బంది ఉన్నారు.

# మహిళా వర్సిటీకి ఐలమ్మ పేరు పట్ల హర్షం

-తెలుగు వర్సిటీకి సోమనాథుని పేరుకై విజ్ఞప్తి
:సోమనాథ కళా పీఠం

కబురు న్యూస్,(పాలకుర్తి ప్రతినిధి):
తెలంగాణ వీర నారి చాకలి ఐలమ్మ పేరును మహిళా విశ్వవిద్యాలయానికి పెట్టుతామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని జనగామ జిల్లా పాలకుర్తిలోని సోమనాథ కళా పీఠం బుధవారం ఒక ప్రకటనలో స్వాగతించింది. ఇదే స్ఫూర్తితో తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదికవి, సామాజిక విప్లవ కవి పాల్కురికి సోమనాథుని పేరు పెట్టాలని సోమనాథ కళాపీఠం బాధ్యులు వీరమనేని వెంకటేశ్వర్ రావు, శంకరమంచి శ్యాంప్రసాద్, రాపోలు సత్యనారాయణ, మార్గం లక్ష్మినారాయణ, ఇమ్మడి దామోదర్, జక్కుల రవీందర్, మామిండ్ల రమేష్ రాజా, రాపాక విజయ్, రాపాక రమేశ్, బజ్జూరి వేణుగోపాల్, రాపోలు వెంకటేశ్వర్లు, గుమ్మడిరాజుల సాంబయ్య, మేరుగు మధుసూదన్, గూడూరు లెనిన్ ప్రభుత్వాన్ని కోరారు.

# ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం



కబురు న్యూస్, (పాలకుర్తి ప్రతినిధి):
పాలకుర్తి మండల కేంద్రంలో గౌడ కాలనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రోజు మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి దాతగా ఎడవెల్లి పుష్పలత- సోమల్లయ్య . ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతారావు,గంగుకృష్ణమూర్తి,వీరమనేని వెంకటేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగన్న,వీరమనేని తిమ్మారావు, గౌడ సంఘం నాయకులు కమ్మగాని నాగన్న, కమ్మగాని చుక్క సారయ్య, కమ్మగాని పరశరాములు, బండి కొండయ్య, బండి కిరణ్, కమ్మగాని శ్రీకాంత్,కమ్మగాని మంజుల పరమేశ్వర్,గౌడ కాలనీ విగ్నేశ్వర కమిటీ అధ్యక్షుడు కమ్మగాని నరేష్, గౌడ్ కోశాధికారి తోట్టే సంపత్,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రంగనాథ దేవాలయం అభివృద్ధి కోసం విరాళం

కబురు న్యూస్, ప్రతినిధి వరంగల్ జిల్లా



కాశీబుగ్గలోని అతి పురాతన శ్రీ రంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధికి కాశీబుగ్గ చెందిన గడ్డం సదానందం లక్ష రూపాయల విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సదనందాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో రంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి సుల్తానా సమ్మక్క ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు కూరపాటి రోజా గడ్డం భాస్కర్ దూడం రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.



(కబురు న్యూస్, ప్రతినిధి జమ్మికుంట )
ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని హుజురాబాద్ డిఎస్ఆర్పి కౌన్సిలర్ బత్తుల బబిత అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులచే ఎయిడ్స్ పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బబిత మాట్లాడుతూ.... వృత్తిలో భాగంగా చాలా రోజులపాటు ఇంటిని వదిలి సుదూర ప్రదేశాలకు వెళ్లవలసి వస్తుందని, అలాంటి సమయంలో పర స్త్రీలతో కలవడం వల్ల హెచ్ఐవి వచ్చే అవకాశాలు ఉన్నాయని డ్రైవర్స్ కు తెలియజేశారు. హెచ్ఐవి సోకిన వ్యక్తులు అధైర్య పడకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించుకొని సరియైన మందులు వాడడం ద్వారా ఆ వ్యాధిని పెరగకుండా చూడవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రత్యేక దృష్టి సారించి అనేకమైన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి మంచి ఆరోగ్యంతో పాటు మంచి కుటుంబాన్ని ఏర్పరచుకొని ఉండాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని దీని ద్వారా మన శరీరంలో ఉన్న రుగ్మతల గురించి తెలుసుకునే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లారీ డ్రైవర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పొన్నగంటి మల్లయ్య, అధ్యక్షులు రామస్వామి, ప్రధాన కార్యదర్శి రియాజ్ తోపాటు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ అకాడమి చైర్మన్ ని కలుసుకున్న

సీనియర్ జర్నలిస్ట్ ప్రభు



కబురు న్యూస్, ప్రతినిధి జమ్మికుంట)
రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో సీనియర్ జర్నలిస్ట్ అంబాల ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.
పుష్పగుచ్చాలను అందజేసి ,శాలలతో సన్మానం చేశారు. జర్నలిస్టులకు నివేషణ స్థలాలను అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణపై అవగాహన...

కబురు న్యూస్, ప్రతినిధి జమ్మికుంట



కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని సంఘ సభ్యులకు పరిసరాల పరిశుభ్రత, సింగల్ యూస్ ప్లాస్టిక్ పై మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్ అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ........ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి మహిళా ముందడుగు వేసి పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుతూ, వర్షాల వల్ల నీరు నిల్వ ఉన్న చోట ప్రతి శుక్ర, మంగళ వారాలలో డ్రై డే నిర్వహించి, మీ ఇంటితో పాటు చుట్టూ పక్కల ఇండ్లలో కూడా డ్రై డే చేయు విధంగా అవగాహన కల్పించాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని అన్నారు. వార్డులలో వచ్చే చెత్త బండికి తడి, పొడి చెత్తను వేరు చేసి వాహనాలకు అందించాలన్నారు. ప్రతి సంఘ సభ్యురాలు బ్యాంకు ద్వారా అందించే రుణాలతో ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగించాలని చెప్పారు. కూరగాయలకు, ఇతర సామాగ్రి తీసుకునేటప్పుడు ప్లాస్టిక్ సంచులను, కవర్లను వాడవద్దని, జ్యూట్ బ్యాగ్ లు, బట్ట సంచిని ఉపయోగించాలని ఆయన అన్నారు. మీతో పాటు ఇంటి చుట్టూ పక్కల వారికీ కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ %+% రాజిరెడ్డి, సిఎల్ఆర్పీ మంజుల, ఆర్పీలు దేవేంద్ర, కె రజిత, మల్లీశ్వరిలతో పటు పలు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# ఆ మాటకి దూరం కాకుండా చూసుకుంటున్నా!

కబురు సినిమా సెప్టెంబర్ 11..

"సందేశంతో పాటు అన్ని రకాల వాణిజ్యాంశాలు నిండిన కథతో రూపొందిన చిత్రం 'ఉత్సవం'. తెరపై కనిపించే ప్రతి సన్నివేశం మనసుల్ని హత్తుకుంటుంది" అంది నటి రెజీనా. ఆమె.. దిలీప్ ప్రకాష్ జంటగా నటించిన ఈ 'ఉత్సవం'ను అర్జున్ సాయి తెరకెక్కించారు. రాజేంద్రప్రసాద్, ప్రకాశ్‌రాజ్, నాజర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 13న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది రెజీనా.

"ఇది చాలా మంచి సినిమా. రంగస్థల కళాకారుల నేపథ్యంలో ఉంటుంది. దర్శకుడు అర్జున్ ఈ కథ వినిపించినప్పుడే నాకు చాలా గొప్పగా అనిపించింది. ఆయన నాటక రంగం గురించి ఎంతో పరిశోధన చేసి ఈ కథను రాసుకున్నారు. సందేశం, వాణిజ్యాంశాల మేళవింపుతో మన మూలాల్ని గుర్తు చేసే చిత్రంగా ఉంటుంది. అందుకే ఈ కథ విన్న పుడే చేయాలని నిర్ణయించుకున్నా".

"ఈ సినిమాలో నేను కార్పొరేట్ ఉద్యోగిగా కనిపిస్తాను. తనకు ప్రేమ మీద అంతగా ఆసక్తి ఉండదు. స్వతంత్ర భావాలున్న యువతి. నా పాత్ర కథలో చాలా కీలకంగా ఉంటుంది. అంతేకాదు ఈ పాత్ర ప్రతి ఇండిపెండెంట్ మహిళా రిలేట్ చేసుకునేలా ఉంటుంది. అందుకే ఈ పాత్ర చేయడం నాకు బాగా నచ్చింది. ఈ చిత్రంలో రంగస్థల నటుల గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలున్నాయి. అవన్నీ ప్రేక్షకుల్ని హత్తుకునేలా ఉంటాయి".

"దర్శకుడు అర్జున్ సాయి తన తొలి సినిమాగా ఇలాంటి గొప్ప కథను చెప్పాలనుకోవడం.. దానికి మైత్రీ మూవీ మేకర్స్, హొంబలే ఫిల్మ్స్ లాంటి పెద్ద సంస్థలు అండగా నిలవడం చాలా ఆనందంగా ఉంది. దిలీప్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. తనకు ఈ సినిమాతో పెద్ద విజయం దక్కాలని కోరుకుంటున్నా. ఈ చిత్రంతో ప్రకాష్‌రాజ్, నాజర్ వంటి అనుభవజ్ఞులైన నటులతో పని చేసే అవకాశం దక్కింది. వాళ్లంతా రంగస్థలం నుంచే వచ్చారు. సెట్లో నేను వాళ్ల నుంచి చాలా నేర్చుకున్నా".

"నాకంటూ ప్రత్యేకంగా లక్ష్యాలేం లేవు. నేను నా తొలి తెలుగు సినిమా 'ఎస్ఎంఎస్' చేసినప్పటి నుంచి నా ఆలోచన ఒక్కటే. విలక్షణమైన నటిగా ఉండాలనుకున్నా. అది నా నుంచి దూరం కాకుండా ఇన్నాళ్లు విభిన్నమైన పాత్రలు చేసుకుంటూ వచ్చా. ఇకపైనా నేను చేయగల అన్ని రకాల పాత్రలు చేయడమే నా గోల్. ప్రస్తుతం నేను గోపీచంద్ మలినేని - సన్నీ దేవోల్ సినిమాలో నటిస్తున్నా. అలాగే హిందీలో రెండు చిత్రాలు పూర్తి చేశా. త్వరలో వాటిని వెల్లడిస్తారు".

# అమ్మ అవ్వబోతున్న తాప్సీ..



కబురు సినిమా సెప్టెంబర్ 11..

దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఝుమ్మంది నాదం సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ తాప్సీ పన్ను. తొలి సినిమాతోనే కుర్రాళ్ల మనసు దోచేసింది. ఆకట్టుకునే రూపం, క్యూట్ స్మైల్ తో మెస్మరైజ్ చేసింది తాప్సీ పన్ను. ఆతర్వాత ఈ బ్యూటీకి తెలుగులో అవకాశాలు వెతుకుంటూ వచ్చాయి. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసి బిజీ హీరోయిన్ గా మారిపోయింది. తెలుగులో చాలా సినిమాల్లో నటించింది ఈ చిన్నది.. కానీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. అదే సమయంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమాతో హిట్ అందుకుంది. ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసింది. అక్కడ వరుసగా సినిమాలు చేస్తుంది. తక్కువ సమయంలోనే బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియంటెడ్ సినిమాలు కూడా చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది ఈ భామ.విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్న తాప్సీ పన్ను.. తాజాగా మరో డిఫరెంట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో నటించిన ఆ సినిమా డైరెక్ట్ గా నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానుంది. ఆ సినిమానే గాంధారి. తాజాగా ఈ సినిమాను అఫీషియల్ గా అనౌన్స్ చేస్తూ ఓ చిన్న వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో ఇప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.'తల్లి ఆశీర్వాదం బిడ్డకు ఎల్లప్పుడూ ఉంటుందని అందరూ అంటారు. అలాగే తన బిడ్డ విషయానికి వస్తే.. ఆమె కాళీమాతగా మారుతుంది " అనే డైలాగ్ తో ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. దీన్ని బట్టి చూస్తుంటే ఈ సినిమాలో తాప్సీ పన్ను ఓ బిడ్డకు తల్లిగా కనిపిస్తుందని అర్థమవుతుంది. తల్లి కూతుళ్ల సెంటిమెంట్‌తో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు మేకర్స్ ఈ వీడియోతో హింట్ ఇచ్చారు. త్వరలోనే ఈ సినిమాకు సంబందించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. తాప్సీ పన్ను ఇప్పటివరకు హీరోయిన్ గా నటించి మెప్పించింది. ఇప్పుడు తల్లి పాత్రలో ఎలా ఆకట్టుకుంటుందో చూడాలి.

# సికందర్‌లో కాజల్?



కబురు సినిమా సెప్టెంబర్ 11..

బాలీవుడ్ కథానాయకుడు సల్మాన్‌ఖాన్, రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'సికందర్'. దీనికి ఎ.ఆర్ మురుగదాస్ దర్శకుడు. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మాత. తాజాగా ఈ చిత్రంలో మరో కథానాయిక కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రతీక్ బబ్బర్ తదితరులు నటిస్తున్న సంగతి తెలిసిందే. త్వరలో కాజల్ షూటింగ్‌లో పాల్గొంటుందని సమాచారం. 2025 ఈద్ సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

# 'కూలీ' కోసం బరిలోకి సైమన్!



కథానాయకులు రజనీకాంత్, నాగార్జున 'కూలీ' కోసం చేతులు కలిపిన సంగతి తెలిసిందే. లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. శ్రుతిహాసన్, ఉపేంద్ర, సౌబిన్ సాహిర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ గత కొన్ని రోజులుగా వైజాగ్‌లో జరుగుతోంది. కాగా, ఇప్పుడీ చిత్ర సెట్స్‌లోకి నాగార్జున అడుగు పెట్టినట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో భాగంగా నాగ్, రజనీలపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతో ఈ చిత్రం ముస్తాబవుతోంది. రజనీ ఇందులో దేవాగా కనిపించనుండగా.. సైమన్ అనే పాత్రలో నాగ్ సందడి చేయనున్నారు.

# సోషల్ మీడియా జర్నలిస్ట్ కావాలనుంది

కబురు సినిమా సెప్టెంబర్ 11..

స్టార్ హీరో రామ్‌చరణ్ సతీమణి ఉపాసన ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. సినిమాలపై, సామాజిక అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకుంటుంటారు. అలానే వారి ఫొటోలను కూడా ఎప్పటికప్పుడు షేర్ చేస్తూ అభిమానుల్లో జోష్ నింపుతుంటారు. తాజాగా ఉపాసన ఓ సిరీస్‌కు రివ్యూ ఇచ్చారు. అనన్య పాండే ప్రధానపాత్రలో నటించిన 'కాల్ మీ బే' సిరీస్ తనకు నచ్చిందని పేర్కొన్నారు. ఈ సిరీస్ పోస్టర్‌ను పంచుకున్న ఉపాసన.. ఇది చూశాక తనకు కూడా సోషల్ మీడియా జర్నలిస్ట్ కావాలనే కోరిక కలిగిందంటూ టీమ్‌ను ప్రశంసించారు.అనన్య పాండే నటించిన ఈ సిరీస్‌పై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. సారా అలీఖాన్, అలియా, నేహా ధుఫియా వారి ఇన్‌స్టాలో ఈ సిరీస్‌పై పోస్ట్‌లు పెట్టారు. ఇలాంటి సిరీస్‌లో నటించినందుకు అనన్యను ప్రశంసిస్తున్నారు. 'నిన్ను చూస్తుంటే గర్వంగా' ఉందని పేర్కొంటున్నారు. 'లైగర్' చిత్రంతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన అనన్యకు తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. ఆ సినిమా విజయం సాధించనప్పటికీ ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి. కొన్ని సంవత్సరాలుగా మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆమెకు 'కాల్ మీ బే' సక్సెస్‌ను ఇచ్చింది. ప్రస్తుతం ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.కొల్లిన్ డి కున్హా దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఓ ధనిక మహిళ చుట్టూ తిరుగుతుంటుంది. ధనవంతురాలైన ఓ మహిళ తన సంపదను కోల్పోయిన తర్వాత ఆమె జీవితం ఎలాంటి మలుపు తిరిగింది అనే అంశాన్ని ఇందులో చూపించారు. భర్త విడిచివెళ్లాక ఆమె ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొందో ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. ఇందులో ధనికురాలిగా అనన్య నటన ఆకట్టుకుంది.

# ఆ లక్ష్యంతోనే పని చేస్తున్నా.. అప్‌కమింగ్ సినిమాల వివరాలు పంచుకున్న ప్రశాంత్ వర్మ

కబురు సినిమా సెప్టెంబర్ 11..



ప్రస్తుతం టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ప్రశాంత్‌వర్మ సినిమాల కోసం ఎదురుచూస్తున్నారు. ఆయన తర్వాత సినిమాల లిస్ట్ చూసి బాక్సాఫీస్ వద్ద సంచలనం ఖాయమని అంటున్నారు. 'హనుమాన్'తో బ్లాక్‌బస్టర్‌ను సొంతం చేసుకున్న ప్రశాంత్ వర్మ . దాని సీక్వెల్ పనుల్లో బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ.. 'జై హనుమాన్' విడుదల తేదీ, ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ గురించి వివరాలు పంచుకున్నారు. తన తర్వాత సినిమాల్లో బాలీవుడ్ స్టార్స్ కూడా నటిస్తారా అనే ప్రశ్నకు ఆసక్తికర సమాధానమిచ్చారు.' ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ కోసం నేను కొందరు బాలీవుడ్ స్టార్స్‌ను కలిశాను. వారితో నా ఆలోచనలను పంచుకున్నాను. ఇందులో వారు కచ్చితంగా భాగమవుతారు. కాకపోతే కాస్త సమయం పడుతుంది. ఎందుకంటే ఈ సినిమాటిక్ యూనివర్స్ ఇంకా ప్రారంభదశలోనే ఉంది. 'జై హనుమాన్' పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 'హనుమాన్' రూ.100 కోట్లు మాత్రమే వసూలు చేసుంటే మేము దాని సీక్వెల్‌ను ఈపాటికి ఎప్పుడో విడుదల చేసేవాళ్లం. కానీ ఆ చిత్రం మా అంచనాలకు మించి కలెక్షన్లు సొంతం చేసుకుంది. దీంతో మా బాధ్యత కూడా పెరిగింది' అన్నారు."జై హనుమాన్' కోసం ఎంతోమంది కష్టపడుతున్నారు. స్క్రిప్ట్ వర్క్ పనులు జరుగుతున్నాయి. మీ అంచనాలను అందుకునేలా సినిమా ఉంటుంది. అభిమానులు స్క్రీన్‌పై ఏ అంశాలనైతే చూడాలనుకుంటున్నారో వాటిని మేము కచ్చితంగా చూపిస్తాం. నటీనటుల ఎంపిక కూడా దాదాపు పూర్తయింది. 'హనుమాన్' సమయంలో మొదట షూటింగ్ చేసి తర్వాత వీఎఫ్ఎక్స్ పనులు ప్రారంభించాం. కానీ, దీని సీక్వెల్‌కు మాత్రం వీఎఫ్ఎక్స్ పనులు ముందే సిద్ధం చేస్తున్నాం. దీనివల్ల పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కువ సమయం పట్టవు. దీని షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు" అంటూ 'జై హనుమాన్' అప్‌డేట్‌ను పంచుకున్నారు.తన అప్‌కమింగ్ సినిమాల గురించి మాట్లాడుతూ.. "జై హనుమాన్' కంటే ముందు 'అధీరా' వస్తుంది. దీనితో పాటు మరో రెండు సినిమాలకు కూడా పనిచేస్తున్నాం. ఇతర దర్శకులు కూడా వీటి కోసం వర్క్ చేస్తున్నారు. ఈ నెలలో దీని షూటింగ్ ప్రారంభించే అవకాశముంది. ప్రతి సంవత్సరం కనీసం ఒకటి, రెండు సినిమాలు విడుదల చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం" అన్నారు. ప్రశాంత్ వర్మ లైనప్‌లో తాజాగా మోక్షజ్ఞ సినిమా చేరిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు ఎప్పుడు పంచుకుంటారా అని అభిమానులు ఆసక్తిగా ఉన్నారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com